క్లుప్తంగా

కేసీఆర్ రోడ్‌షో ను విజయవంతం చేయాలి



నాగర్‌కర్నూల్: పార్లమెంట్ ఎన్నికల ప్రచారంలో భాగంగా ఈ నెల 27 సాయంత్రం 6 గంటలకు జిల్లా కేంద్రంలో మాజీ సీఎం కేసీఆర్ రోడ్‌షో నిర్వహిస్తునట్లు మాజీ ఎమ్మెల్యే మర్రి జనార్దన్‌రెడ్డి పేర్కొన్నారు. గురువారం జిల్లా కేంద్రంలో ఆయన నివాసంలో నాయకులకు, కార్యకర్తలకు దిశానిర్దేశం చేశారు. అనంతరం మర్రి జనార్దన్ మాట్లాడుతూ కార్యకర్తుల అధిక సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

నిత్యాన్నదానానికి విరాళం



అచ్చంపేట రూరల్: శ్రీశైల ఉత్తర ముఖద్వారమైన ఉమామహేశ్వర క్షేత్రంలో నిర్వహిస్తున్న నిత్యాన్నదానానికి గురువారం రేజింతల అనంతమ్మ భర్త జంగయ్య జ్ఞాపకార్థకంగా రూ. 25,116 వేలు విరాళంగా ఆలయ కమిటీ చైర్మన్ కందూరి సుధాకర్ అందజేశారు. అంతకుముందు దాత కుటుంబ సభ్యులు సత్యనారాయణ, పుష్పలత, వెంకటేశ్వర్లు, అరుణ ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. దాతను ఆలయం ఆధ్వర్యంలో సన్మానించారు.

ఘనంగా చక్రతీర్థ సేవ



లింగాల: మండల కేంద్రంలోని కోదండరామాలయంలో బ్రహ్మోత్సవాలలో భాగంగా గురువారం 'చక్రతీర్థ' సేవ భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. సందర్భంగా ఉత్సవ విగ్రహాలను పల్లకీలో ఏర్పాటు చేసి ఊరేగించారు. భజన సంకీర్తనలు ఆలపిస్తూ బావి వద్దకు వెళ్లి నీటితో శుద్ధి చేశారు. భక్తులు మంగళహారతులు ఇచ్చి మొక్కులు చెల్లించుకున్నారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

మామిడికాయలకు తగ్గిన డిమాండ్



పెద్దకొత్తపల్లి: మామిడి కాయలకు రోజురోజుకు డిమాండ్ తగ్గుతోంది. దీంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. గతంలో క్వింటాలు రూ.50 వేలు ఉండగా రూ.30 వేలకు పడిపోయిందని రైతులు వాపోయారు. ప్రభుత్వ కొనుగోలు కేంద్రాలు లేకపోవడంతో వ్యాపారులు అడిగిన ధరకే విక్రయించాల్సిన దుస్థితి నెలకొందని ఆవేదన వ్యక్తం చేశారు. కొల్లాపూర్‌లో మామిడి మార్కెట్‌ను ఏర్పాటు చేసి రైతులను ఆదుకోవాలని కోరుతున్నారు.

బీజేపీ నాయకుల ర్యాలీ



తెలకపల్లి: నాగర్‌కర్నూల్‌లో బీజేపీ ఎంపీ అభ్యర్థి పోతుగంటి భరత్‌ప్రసాద్ నామినేషన్ దాఖలు వేయనున్న సందర్భంగా గురువారం మండల కేంద్రంలోని పురవీధుల గుండా బైక్ ర్యాలీ నిర్వహించి నినాదాలు చేశారు. కేంద్రంలో ప్రధాని నరేంద్రమోదీతోనే సుస్థిర పాలన సాధ్యమని పేర్కొన్నారు. భరత్‌ప్రసాద్‌ను ఎంపీగా గెలిపించుకుందామని నాయకులు పేర్కొన్నారు. అనంతరం ర్యాలీగా నాగర్‌కర్నూల్‌కు బయలుదేరి వెళ్లారు. కార్యక్రమంలో నాయకులు రమణారెడ్డి, బాబుసాగర్, నరేంద్రాచారి, కొత్తపల్లి రవికుమార్‌రెడ్డి, కనుకు రమేష్ తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన ప్రత్యేక పూజలు



తాడూరు: మండలంలోని పొల్మూరులో నాలుగు రోజులుగా కొనసాగిన సీతారామాంజనేయస్వామి ప్రతిష్ట మహోత్సవాలు గురువారంతో ముగిసాయి. సీతామహాలక్ష్మి హనుమాన్ సమేత విగ్రహ ప్రతిష్ట కార్యక్రమం భక్తిశ్రద్ధలతో కొనసాగాయి. ధ్వజస్తంభ ప్రతిష్ఠ, గాయిత్రి మంత్రం, పూర్ణాహుతి వంటి కార్యక్రమాలను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఏర్పాట్లు చేసినట్లు నిర్వాహకులు గాల్‌రెడ్డి, జంగిరెడ్డిలు తెలిపారు.

దోమల నివారణకు చర్యలు

- జిల్లా ఇమ్యూనైజేషన్ అధికారి డా.రవికుమార్



ఉప్పునుంతలలో ..



జెండా ఊపి ర్యాలీని ప్రారంభిస్తున్న జిల్లా ఇమ్యూనైజేషన్ అధికారి డా.రవికుమార్

నాగర్‌కర్నూల్ క్రైం: దోమలు పుట్టకుండా, కుట్టకుండా నివారణ చర్యలు చేపట్టాలని జిల్లా ఇమ్యూనైజేషన్ అధికారి డా.రవికుమార్ అన్నారు. ప్రపంచ మలేరియా దినోత్సవాన్ని పురస్కరించుకుని జిల్లా వైద్య ఆరోగశాఖ ఆధ్వర్యంలో గురువారం జిల్లా కేంద్రంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడారు. ఇంటి పరిసరాల్లో మురుగు నిల్వకుండా చూడాలని అన్నారు. మలేరియా నివారణకు ప్రతిఒక్కరూ కృషి చేయాలని, ఎవరైనా మలేరియా బారిన పడితే ప్రభుత్వ ఆస్పత్రిలో చేరి ఉచితంగా చికిత్స చేయించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో జిల్లా మాస్ మీడియా అధికారి నర్సింహ, జిల్లా అసిస్టెంట్ మలేరియా ఆఫీసర్ నారాయణస్వామి, పర్యవేక్షణాధికారి కేశవులు పాల్గొన్నారు.

అవగాహన ర్యాలీ

ఉప్పునుంతల: ప్రపంచ మలేరియా దినోత్సవాన్ని పురస్కరించుకొని గురువారం స్థానిక పీహెచ్‌సీ ఆధ్వర్యంలో మండల కేంద్రంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యాధికారి బిక్కులాల్ మాట్లాడుతూ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. మురుగునీరు నిల్వ లేకుండ చూసుకోవాలని కోరారు. దోమతెరలు వాడటం, దోమలు అభివృద్ధి చెందకుండ జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. రమేష్, జగదీష్, సీనయ్య, ఏఎన్‌ఎంలు సావిత్రి, నిర్మల, మంజుల, ఉమా, మల్లేశ్వరీ, వీణ, సరిత, దేవకీబాయి తదితరులు పాల్గొన్నారు.

కొల్లాపూర్: పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ప్రపంచ మలేరియా దినోత్సవం సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ రామరాజు యాదవ్ మలేరియా వ్యాప్తి, దాని నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. ఆరోగ్య పరిరక్షణ, పరిసరాల శుభ్రతపై అవగాహన కల్పించారు. వైస్ ప్రిన్సిపాల్ ఉదయ్‌కుమార్, అధ్యాపకులు ఉన్నారు.

తాగునీటి ఎద్దడి రానీయొద్దు



మాట్లాడుతున్న ఎమ్మెల్యే వంశీకృష్ణ

చారకొండ: ఎండాకాలంలో తాగునీటి ఎద్దడి రాకుండా అధికారులు చర్యలు తీసుకోవాలని అచ్చంపేట్ ఎమ్మెల్యే చిక్కుడు వంశీకృష్ణ సూచించారు. మండల కేంద్రంలో రైతు వేదికలో గురువారం ఎంపీపీ నిర్మల విజేందర్ గౌడ్ అధ్యక్షతన సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ముఖ్య అతిథులుగా ఎమ్మెల్యేతో పాటు నాగర్‌కర్నూల్ జెడ్పీ వైస్ చైర్మన్ బాలాజీ సింగ్ హాజరయ్యారు. గ్రామాల్లో నెలకొన్న సమస్యలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. అధికారులు ప్రగతి నివేదికను చదివి వినిపించారు. మండలంలోని సిర్సనగండ్ల, జేపల్లి, చంద్రాయన్‌పల్లి, తండాలలో తాగునీటి సమస్య అధికంగా ఉందని ప్రజాప్రతినిధులు సభ దృష్టికి తీసుకొచ్చారు. తిమ్మాయిపల్లి, సారంబండ తండా, చారకొండలో విద్యుత్ సమస్యలను లేవనెత్తారు. అనంతరం ఆయా శాఖల వారీగా సమస్యలపై సమీక్ష నిర్వహించారు. అనంతరం ఎమ్మెల్యే, జెడ్పీ వైస్ చైర్మన్ మాట్లాడుతూ గ్రామాల్లో నెలకొన్న సమస్యలను వెంటనే పరిష్కరించాలని అధికారులను కోరారు. రైతులకు సకాలంలో ఎరువులు, విత్తనాలు అందుబాటులో ఉంచాలన్నారు. గ్రామాలకు బీటీ రోడ్డు సౌకర్యం కల్పిస్తామన్నారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ బక్కమ్మ, సింగిల్ విండో చైర్మన్ గుర్వయ్య గౌడ్, ఎంపీడీఓ ఇసాక్ హుస్సేన్, ఎంపీటీసీ, లక్ష్మణ్, లలిత, లక్ష్మణ్ నాయక్, ఆయా శాఖల అధికారులు తదితరులు ఉన్నారు.

నేడు డయల్ యువర్ డీఎం

కొల్లాపూర్: డయల్ యువర్ డీఎం కార్యక్రమాన్ని శుక్రవారం 4 గంటల నుంచి 5 గంటల వరకు నిర్వహిస్తునట్లు డీఎం ఉమాశంకర్ గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. డిపో పరిధిలో ఉన్న సమస్యలు, సలహాలు తెలపాలని పేర్కొన్నారు. సెల్ నంబర్: 9000405878 ను సంప్రదించాలని కోరారు.

ఆటోను ఢీకొట్టిన బస్సు

నాగర్‌కర్నూల్ క్రైం: మినరల్ వాటర్ బాటిళ్ల లోడ్‌తో ఉన్న ఆటోను ఆర్టీసీ బస్సు ఢీకొట్టిన ఘటన జిల్లా కేంద్రంలోని హౌజింగ్ బోర్డు కాలనీలో గురువారం చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం హౌజింగ్‌బోర్డు కాలనీలో రోడ్డుపై ఆటో నిలిపారు. ప్రమాదవశాత్తు ఆటోను ఆర్టీసీ బస్సు ఢీకొన్నది. ఈ ప్రమాదంలో ఆటో ధ్వంసమైంది. ఆటో డ్రైవర్‌కు స్వల్పగాయాలయ్యాయి.

బాధిత కుటుంబానికి అండగా ఉంటాం



బాధిత కుటుంబాన్ని పరామర్శిస్తున్న ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి

వెల్దండ: బాధిత కుటుంబానికి అండగా ఉంటామని ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి భరోసా ఇచ్చారు. మండలంలోని కొట్ర గ్రామానికి చెందిన వసంతపు మహేష్‌యాదవ్ రోడ్డు ప్రమాదంలో బుధవారం మృతి చెందాడు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే బాధిత కుటుంబాన్ని కల్వకుర్తి ఆస్పత్రిలో పరామర్శించి ఓదార్చారు. ప్రభుత్వ పరంగా కుటుంబాన్ని అన్ని విధాలుగా ఆదుకుంటామని పేర్కొన్నారు. అనంతరం రూ.10 వేల ఆర్థికసాయం అందజేశారు. నాయకులు కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు మోతిలాల్‌నాయక్, సంజీవ్‌కుమార్‌యాదవ్, జంగయ్యయాదవ్, రవీందర్‌రావు, పర్వత్‌రెడ్డి, ఎర్రశ్రీనుముదిరాజ్ తదితరులు ఉన్నారు.

మన్ననూర్: అమ్రాబాద్ మండలం మన్ననూర్ గ్రామానికి చెందిన కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకురాలు ప్యారసాని బాలమ్మ (76) అనారోగ్యంతో గురువారం మృతి చెందింది. సమాచారం తెలుసుకున్న ఎమ్మెల్యే డాక్టర్ వంశీకృష్ణ ఆమె పార్థీవదేహంపై పూలమాల వేసిన నివాళులర్పించారు. ఎమ్మెల్యే వెంట ఎంపీటీసీలు రహీం, శ్రీనివాసులు, బుచ్చయ్య, మోతిలాల్, వెంకటేశ్వర్లు, హన్మంత్ రెడ్డి, వెంకటయ్య, శివాజీ, రాజారాం, బాలు, రాజు తదితరులు పాల్గొన్నారు.

చిన్నారులపై వీధికుక్క దాడి

అచ్చంపేట రూరల్: ఒకేరోజు ఎనిమిది మంది చిన్నారులపై ఓ శునకం దాడి చేసి గాయపర్చిన ఘటన పట్టణంలోని టీచర్స్‌కాలనీలో గురువారం చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం పాఠశాలలకు సెలవులు ఉండటంతో కాలనీలోని చిన్నారులంతా ఒకే చోట ఆడుకుంటున్నారు. అటువైపుగా వచ్చిన ఓ వీధికుక్క 8 మంది చిన్నారులపై దాడి చేసి గాయపర్చింది. గమనించిన చిన్నారుల తల్లిదండ్రులు వెంటనే ప్రభుత్వ, ప్రైవేట్ ఆస్పత్రికి తీసుకెళ్లారు. వీధికుక్కలపై మున్సిపల్ అధికారులు, పాలకవర్గానికి విన్నవించినా పట్టించుకోవడం లేదని ఆయా కాలనీ ప్రజలు వాపోయారు.

డెయిరీ సైన్స్ విద్యార్థుల క్షేత్ర పర్యటన



అవగాహన కల్పిస్తున్న మేనేజర్ నరేందర్

నాగర్‌కర్నూల్: ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు చెందిన డైయిరీ సైన్స్ విద్యార్థులు క్షేత్ర పర్యటనలో భాగంగా అధ్యాపకుడు ఇంజమూరి దశరథం యాదవ్ ఆధ్వర్యంలో గురువారం నాగర్‌కర్నూల్ మండలం ఉయ్యాలవాడలో ఉన్న పాల శీతలీకరణ కేంద్రాన్ని సందర్శించారు. అక్కడి నిర్వాహకుల ద్వారా పాలను సేకరించే విధానం, ధర నిర్ణయం, ఫ్యాట్ ఎస్‌ఎంఎఫ్‌ల కొలత, పాలను సెంట్రిప్యూజ్, నిలువ చేసే విధానాన్ని తెలుసుకున్నారు. పాలకేంద్రం మేనేజర్ నరేందర్ కేంద్ర నిర్వహణపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో 40 మంది విద్యార్థులు పాల్గొన్నారు.

విద్యార్థినికి సన్మానం



కొల్లాపూర్: కొల్లాపూర్ పట్టణానికి చెందిన పాలిశెట్టి శ్రీవైష్ణవి ఇంటర్ ఫస్టియర్ ఎంపీసీ విభాగంలో 468 మార్కులు సాధించి స్టేట్ ఫస్ట్ ర్యాంకు సాధించింది. హైదరాబాద్‌లోని నారాయణ కళాశాలలో ఆమె చదువుతోంది. గురువారం కొల్లాపూర్‌లో శ్రీవైష్ణవితో పాటు, ఆమె తల్లిదండ్రులు శివకుమార్, చైతన్యలను స్థానికులు సత్కరించారు. అదేవిధంగా పదో తరగతి వరకు చదువుకున్న గోమతి హైస్కూల్ ఉపాధ్యాయులు ఆమెను శాలువాతో కప్పి అభినందించారు. పాఠశాల ప్రిన్సిపాల్ ధనుంజయ్‌గౌడ్, ఉపాధ్యాయులు కవిత, శివకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

కూలీలకు పని దినాలు పెంచాలి



ఉపాధి కూలీలతో మాట్లాడుతున్న ఆంజనేయులు

కల్వకుర్తిరూరల్: గ్రామీణ ఉపాధిహామీ పథకంలో పనిదినాలు ప్రతి సంవత్సరం 200 రోజులుకు పెంచాలని రోజుకు రూ.600లు కూలీ చెల్లించాలని తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు ఆంజనేయులు డిమాండ్‌చేశారు. గురువారం మండలం ఎల్లికల్‌లో పనిచేస్తున్న కూలీల వద్దకు వెళ్లి మాట్లాడారు. కూలీలు పనిచేస్తూ చనిపోతే రూ.5 లక్షల పరిహారం ఇవ్వాలని కోరారు. ఆయన వెంట సి ఆంజనేయులు, వినోద్, సిద్దయ్య, శివలింగం తదితరులు ఉన్నారు.

లింగాల: కూలీల సంఖ్య పెంచేందుకు చర్యలు తీసుకుంటున్నామని ఎంపీడీఓ ఆంజనేయులు అన్నారు. గురువారం మండల పరిషత్ కార్యాలయంలో ఉపాధి పనుల అమలుపై సమీక్ష సమావేశం నిర్వహించారు. సమావేశంలో ఎంపీఓ కర్ణనాయక్, ఏపీఓ ఇమాంఅలీ, ఈసీ శ్రీనివాస్, పంచాయతీ కార్యదర్శులు, టీఏలు, ఎఫ్ఏలు పాల్గొన్నారు.

తాడూరు: మండలంలోని ఎంగంపల్లి, గుంతకోడూరు, మేడిపూర్ గ్రామాల్లో ఉపాధి పనులతో పాటు వననర్సరీలను గురువారం ఏపీఓ చంద్రసిద్ధార్థ ఆకస్మికంగా సందర్శించారు. పని ప్రదేశాల వద్ద తాగునీరు, నీడ వసతి కల్పించాలని సిబ్బందికి సూచించారు. ఆయన వెంట సిబ్బంది ఉన్నారు.

30న మాదిగల ఐక్యవేదిక సమావేశం

కొల్లాపూర్: పట్టణంలోని మహెబూబ్ ఫంక్షన్ హాల్‌లో ఈ నెల 30న మాదిగల ఐక్యవేదిక సమావేశం నిర్వహిస్తునట్లు మీసాల రామన్నమాదిగ తెలిపారు. గురువారం పట్టణంలో ఏర్పాటు చేసిన సమావేశంలో నాయకులు హాజరయ్యారు. ముఖ్య అతిథిగా ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ హాజరవుతారని పేర్కొన్నారు. నాగులపల్లి లక్ష్మయ్య, కాటం జంబులయ్య, కారంగి బ్రహ్మయ్య తదితరులున్నారు.

ఘనంగా అంగన్‌వాడీ కేంద్రం వార్షికోత్సవం



గుట్టమీది తండాలో హాజరైన చిన్నారులు

ఉప్పునుంతల: మండలంలోని గుట్టమీది తండా అంగన్‌వాడీ కేంద్రంలో గురువారం వార్షికోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఐదేళ్ల వయస్సు పైబడిన పిల్లలను స్థానిక పాఠశాలలో చేర్పించాలని చిన్నారుల తల్లిదండ్రులకు అంగన్‌వాడీ టీచర్ పద్మ అవగాహన కల్పించారు. విద్య ప్రాధాన్యాన్ని వివరించారు. అదేవిధంగా మూడు సంవత్సరాలు వయస్సు దాటిన పిల్లలను అంగన్‌వాడీ కేంద్రంలో చేర్పించాలని కోరారు. పౌష్టికాహారం తీసుకోవడం ద్వారా కలిగే ప్రయోజనాలను తెలిపారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్ పద్మ, ఆయా భారతమ్మ, పిల్లల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

చిన్నారులను అంగన్‌వాడీలో చేర్పించాలి

కల్వకుర్తి: చిన్నారులను అంగన్‌వాడీ కేంద్రంలో చేర్పించాలని సూపర్‌వైజర్ పద్మావతి అన్నారు. గురువారం పట్టణంలోని సుభాష్‌నగర్ కాలనీ అంగన్‌వాడీ కేంద్రంలో వార్షికోత్సవం నిర్వహించారు. సూపర్‌వైజర్ పద్మావతి, అలివేలు, భాగ్యమ్మ, విద్యావతి, అంగన్‌వాడీ టీచర్లు, పాల్గొన్నారు.

ఉద్యోగాల కల్పనలో కేంద్ర ప్రభుత్వం విఫలం



అచ్చంపేట రూరల్: ఉద్యోగాల కల్పనలో కేంద్ర ప్రభుత్వం విఫలం అయ్యిందని యూటీఎఫ్ రాష్ట్ర నాయకుడు మల్లయ్య, జర్నలిస్ట్ వెంకటేశ్వర్లు ఆరోపించారు. గురువారం పట్టణంలోని సీఐటీయూ కార్యాలయంలో భారత ప్రజాతంత్ర యువజన సమైక్య (డీవైఎఫ్ఐ) డివిజన్ విస్తృత స్థాయి సమావేశాన్ని జిల్లా అధ్యక్షుడు సైదులు అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం అధికారంలోకి రాగానే రూ.2 కోట్ల ఉద్యోగాలు భర్తీ చేస్తామని నిరుద్యోగ యువతకు హామీ ఇచ్చిందని గుర్తుచేశారు. కార్యక్రమంలో డీవైఎఫ్ఐ జిల్లా ప్రధాన కార్యదర్శి శివవర్మ, కిరణ్, సునీల్, శివరాం, శివశంకర్, సాయి, అజయ్, శ్రీను, రాజు పాల్గొన్నారు.

మెయిన్స్‌లో సత్తాచాటిన విద్యార్థులు



విద్యార్థికి స్వీటు తినిపిస్తున్న తల్లిదండ్రులు

కల్వకుర్తి టౌన్: జేఈఈ–మెయిన్స్ ఫలితాలలో పట్టణంలోని జేపీనగర్ గురుకుల కళాశాల విద్యార్థులు సత్తాచాటారు. గురుకుల కళాశాల సీఓఈ కేంద్రంలో చదివిన 11 మంది విద్యార్థులు ఉత్తమ ప్రతిభ కనబరిచారని ప్రిన్సిపాల్ దానం గురువారం తెలిపారు. కళాశాలలో చదివిన మహేష్ 82.17 పర్సంటైల్ సాధించగా, ప్రణయ్ కుమార్ 80.39 పర్సంటైల్‌తో పాటుగా మరో 9 మంది విద్యార్థులు 75 పర్సంటైల్‌కు పైగా సాధించారని ఆయన తెలిపారు. ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులను ఆర్సీఓ విద్యుల్లతతో పాటుగా కళాశాల సిబ్బంది అభినందించారు.

పెంట్లవెల్లి: జటప్రోల్ గ్రామానికి చెందిన ఫరీద్ రజియాసుల్తానుల కుమారుడు రేహాన్ జేఈఈ మెయిన్స్ ఆల్ ఇండియాలో 88వ ర్యాంకు సాధించాడు. గ్రామస్తులు రేహాన్‌కు శుభాకాంక్షలు తెలిపి సన్మానించారు.

దోమలపెంట: జేఈఈ మెయిన్స్‌లో దోమలపెంట విద్యార్థిని వి.శ్రీకాంక్ష 92.6 పర్సంటైల్ సాధించి ఎన్ఐటీ, ఐఐఐటీలో ప్రవేశానికి అర్హత సాధించింది.

బీజేపీ, కాంగ్రెస్ హామీలు నమ్మొద్దు



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్

కల్వకుర్తిరూరల్: బీజేపీ, కాంగ్రెస్ హామీలు నమ్మి మోసపోవద్దని బీఆర్ఎస్ మాజీ ఎమ్మెల్యే జైపాల్ యాదవ్ అన్నారు. గురువారం పట్టణంలోని ఆయన నివాసంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. కాంగ్రెస్, బీజేపీలపై ప్రజలకు నమ్మకం పోయిందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఆరు గ్యారంటీ పథకాల అమలులో విఫలం అయ్యిందన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి ఇష్టానుసారంగా మాట్లాడి ప్రజల్లో విశ్వాసం కోల్పోయరన్నారు. నెల 27న మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ నాగర్‌కర్నూల్ పర్యటనకు వస్తారని వివరించారు. సమావేశంలో రాష్ట్రఫుడ్ కమిషన్ చైర్మన్ గోలి శ్రీనివాస్‌రెడ్డి, మున్సిపల్ చైర్మన్ ఎడ్మసత్యం, నాయకులు విజయ్‌గౌడ్, గోవర్ధన్, సూర్యప్రకాష్ రావు, శ్రీనివాస్‌యాదవ్, కృష్ణయ్య, ఈశ్వరయ్య తదితరులు పాల్గొన్నారు.

మల్లు రవికి మద్దతుగా ప్రచారం



వెల్దండలో ప్రచారం చేస్తున్న ఎంపీ అభ్యర్థి మల్లురవి సతీమణి రాజబన్సీ

వెల్దండ: మండలంలోని ఆయా గ్రామాల్లో నాగర్‌కర్నూల్ కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి మల్లురవి మద్దతుగా ఆయన సతీమణి డాక్టర్ రాజబన్సీ గురువారం ఇంటింటి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా వెల్దండ, పల్లుతండా, గుండాల తదితర గ్రామాల్లో ఇంటింటికి తిరుగుతూ కాంగ్రెస్ పథకాలపై అవగాహన కల్పించారు. మల్లు రవికి ఓటు వేయాలని అభ్యర్థించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు మోతిలాల్ నాయక్, కిసాన్‌సెల్ అధ్యక్షుడు పర్వత్‌రెడ్డి, నాయకులు శ్రీనివాస్, శేఖర్, ఎర్రశ్రీనుముదిరాజ్, బక్యనాయక్, పుల్లయ్య, రమేష్, గోపాల్‌నాయక్, పంతునాయక్, రవినాయక్, జగన్ తదితరులు ఉన్నారు.

కల్వకుర్తిరూరల్: మండలంలోని తోటపల్లిలో సర్పంచ్‌ల సంఘం మాజీ రాష్ట్ర కార్యదర్శి పసుల రాజేష్ రెడ్డి శ్రీలత దంపతులు గురువారం నాగర్‌కర్నూల్ పార్లమెంట్ అభ్యర్థి మల్లురవికి మద్దతుగా ప్రచారం చేపట్టారు. కాంగ్రెస్‌తోనే ప్రజారంజక పాలన సాధ్యమన్నారు. కార్యక్రమంలో నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

మానవత్వం చాటుకున్న పోలీసులు



సలేశ్వరం లోయ నుంచి వృద్ధ మహిళను వీపుపై ఎత్తుకుని వస్తున్న పోలీస్ రాందాస్

మన్ననూర్: నాగర్‌కర్నూల్ జిల్లా కేంద్రానికి చెందిన సుమారు 70 ఏళ్ల ఓ వృద్ధ మహిళ సలేశ్వరం జాతరకు వచ్చింది. లోయలో నడుచుకుంటు స్వామివారి దర్శనానికి బయలుదేరింది. బుధవారం సాయంత్రం తిరుగుప్రయాణంలో మహిళ నీరసించింది. నడిచేందుకు కూడా ఇబ్బంది పడుతోంది. అక్కడే విధులు నిర్వర్తిస్తున్న మన్ననూరు గ్రామానికి చెందిన పోలీస్ రాందాస్ మహిళను గమనించి వివరాలు అడగి తెలుసుకున్నారు. మహిళ శక్తిహీనంగా ఉండటంతో భుజాలపై ఎత్తుకొని కొండపైకి తీసుకొచ్చి మానవత్వం చాటుకున్నాడు. సత్రంలో భోజనం చేయించి ఆటో సహాయంతో పుల్లాయిపల్లికి తీసుకువచ్చి బస్సు ఎక్కించి పంపించాడు. స్థానికుల నుంచి పోలీస్ మన్ననలు పొందారు. అటు అధికారులు రాందాస్‌ను అభినందించారు. అదేవిధంగా చెంచు పెంటకు చెందిన భక్తుడు శివ బుధవారం సలేశ్వరం లింగమయ్య దర్శనం కోసం వెళ్లాడు. లోయలో తలనీలాలు సమర్పించుకునే ప్రాంతంలో అకస్మాత్తుగా ఫిట్స్ వచ్చి కింద పడ్డాడు. అక్కడే విధి నిర్వాహణలో ఉన్న జోగులాంబ గద్వాల జిల్లాకు చెందిన సాయుధ పోలీసులు వెంకట్రాములు, రాముడు భక్తుడిని గమనించి ప్రథమ చికిత్స చేశారు. సకాలంలో స్పందించి భక్తులకు సేవలు చేసిన పోలీసులను జిల్లా ఎస్పీ శ్రీమతి రితిరాజ్ ప్రశంసించారు.

రోడ్లపైనే వరి ధాన్యం ఆరబోత



రోడ్డుపై వరి ధాన్యాన్ని ఆరబోసిన రైతు

తాడూరు: మండల కేంద్రంతోపాటు ఆయా గ్రామాలకు వెళ్లే ప్రధాన రోడ్లపై రైతులు పండించిన మొక్కజొన్నలు, వరిధాన్యాన్ని రోడ్లపై ఎండబెట్టడంతో వాహనాల రాకపోకలకు ఇబ్బందులు ఏర్పడుతున్నాయి. మండలంలోని ఇంద్రకల్ నుంచి జడ్చర్లకు వెళ్లే ప్రధాన ఆర్అండ్‌బీ డబుల్‌రోడ్డుపై రైతులు మొక్కలజొన్న, వరిధాన్యాన్ని ఆరబెట్టుకుంటున్నారు. సగం రోడ్లను ఆక్రమించి ధాన్యాన్ని అనుసరించుకొని రాళ్ల ఏర్పాటు చేస్తున్నారు. దీంతో వాహనదారులు ప్రమాదాలబారిన పడుతున్నారు. గతేడాది శిర్సవాడ గ్రామానికి చెందిన ద్విచక్ర వాహనదారుడు అదుపు తప్పి కింద పడడంతో అక్కడికక్కడే మృతిచెందాడు. అధికారులు తెలిసినా పట్టించుకోవడం లేదని వాహనదారులు వాపోతున్నారు. సంబంధిత అధికారులు స్పందించి ప్రమాదాలు జరగకుండా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

మట్టి రోడ్డుతో తప్పని తిప్పలు



పుల్జాల నుంచి కార్వంగ వెళ్లే మట్టి రోడ్డు

నాగర్‌కర్నూల్‌రూరల్: మండలంలోని పుల్జాల గ్రామం నుంచి జమిస్తాపూర్ మీదుగా కార్వంగ గ్రామాలకు మట్టి రోడ్డే దిక్కు అయ్యాయి. దీంతో ఆయా గ్రామాలకు వెళ్లేందుకు తిప్పలు తప్పడం లేదు. వర్షాకాలంలో మట్టి రోడ్లు బురదమయంగా మారడంతో అడుగుతీసి అడుగు వేయలేని దుస్థితి నెలకొంటుందని స్థానికులు వాపోయారు. గుంతలలో నీరు నిల్వ ఉండటంతో ద్విచక్రవాహనాలు ప్రమాదాలబారిన పడుతున్నారు. ఎన్నికల్లో నాయకులు బీటీ నిర్మిస్తామని హామీలు ఇవ్వడమే గాని అమలుకు నోచుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వర్షాకాలంలో పుల్జాల నుంచి 3 కిలోమీటర్ల దూరంలో ఉన్న కార్వంగ గ్రామానికి రాకపోకలు నిలిచిపోతున్నాయి. దీంతో తాళ్లపల్లి మీదుగా కార్వంగకు 7 కిలోమీటర్లు ప్రయాణించాల్సిన దుస్థితి నెలకొంది. జమిస్తాపూర్‌కు వెళ్లేందుకు 20 కిలోమీటర్ల ప్రయాణిస్తున్నామని వాహనదారులు వాపోయారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి మట్టి రోడ్డును బీటీ రోడ్డుగా మార్చాలని స్థానికులు కోరుతున్నారు.

కాంగ్రెస్ నాయకుల హర్షం

కొల్లాపూర్: నల్గొండ, ఖమ్మం పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థిగా తీన్మార్ మల్లన్నను కాంగ్రెస్ పార్టీ ప్రకటించడంపై కొల్లాపూర్‌లో కాంగ్రెస్ నాయకులు హర్షం ప్రకటించారు. పట్టణంలోని అంబేడ్కర్ విగ్రహానికి వారు పూలమాలలు వేసి నివాళి అర్పించారు. ఈ సందర్భంగా అవుట రాజశేఖర్ మాట్లాడారు. మల్లన్న చేసిన పోరాటాన్ని కాంగ్రెస్ పార్టీ గుర్తించిందన్నారు. బీఆర్ఎస్ పాలనలో జరిగిన అవినీతి, అక్రమాలను ప్రజలకు తెలియజేశారన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు రంగినేని జగదీశ్వరుడు, నాగరాజు, రహీంపాషా, బీరయ్య యాదవ్, కేతూరి ధర్మతేజ, నర్సింహయాదవ్ తదితరులు పాల్గొన్నారు.